సాక్షి
గుంటూరు
గురువారం • 6 • జూన్ • 2024



పెసర్లంకలో పర్యావరణ దినోత్సవం

భట్టిప్రోలు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మొక్కలు నాటారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేడు ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: గోరంట్లలోని వేంకటేశ్వరాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

న్యూస్‌రీల్

నేటితో పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన ముగింపు

కళాశాలల ఎంపిక కోసం ప్రారంభం కానున్న వెబ్ ఆప్షన్ల నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్‌-2024 కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గురువారం ముగియనుంది. ఈనెల 3తో పూర్తి కావాల్సిన సర్టిఫికెట్ల పరిశీలనను ఓట్ల లెక్కింపు కారణంగా సాంకేతిక విద్యాశాఖ 6వ తేదీకి వాయిదా వేసింది. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 1,08,001 నుంచి ఆపై చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాలని హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలల ఎంపికకు సవరించిన షెడ్యూల్ ప్రకారం గురువారం వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం కానుంది.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి స్కూటీ దహనం



చేబ్రోలు: వడ్లమూడిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడికి చెందిన స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం దహనం చేశారు. వడ్లమూడి దళితవాడకు చెందిన జోసఫ్ ఉరఫ్ తంబి స్కూటీపై గ్రామం నుంచి క్వారీ గుడి రోడ్డులో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ముఖానికి గుడ్డలు కట్టుకున్న ఐదుగురు జోసఫ్‌తో వాగ్వివాదానికి దిగారు. స్కూటీ ముందు భాగంలో వైఎస్సార్ సీపీ స్టిక్కర్‌ను తొలగించాలని బెదిరించారు. అభ్యంతరం తెలపటంతో వాహనంపై పెట్రోలు పోసి నిప్పుపెట్టి పరారయ్యారు. ఘటనపై కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపాడు. గత ఏడాది కొనుగోలు చేసిన స్కూటీ దగ్ధం కావడంతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బాధితుడు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించనున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ఎన్నికలు అభినందనీయం

ఎస్పీ తుషార్ డూడీ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఎన్నికల విధి నిర్వహణలో ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అని చెప్పారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన దగ్గర నుంచి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు బందోబస్త్ విధులు నిర్వర్తించిన పోలీస్ అధికార, సిబ్బంది, కేంద్ర/ రాష్ట్ర బలగాలు, ఇతర శాఖల సేవల ప్రశంసనీయమని కొనియాడారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమన్వయంతో బాగా విధులు విజయవంతంగా నిర్వహించారని వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అందరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. హోంగార్డు నుంచి జిల్లా అదనపు ఎస్పీలు వరకు నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి : డీఎఫ్‌వో



బొల్లాపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరావు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలుకూరు తండా వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన తర్వాత సంరక్షించాలని సూచించారు. అప్పుడే సకాలంలో వర్షాలు కురవడంతోపాటు రుతుపవనాల ప్రభావం సక్రమంగా ఉంటుందన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్రధానంగా అటవీ సంపదను రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, సిబ్బంది, వనసంరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే క్రిమినల్ చర్యలే

- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరిక
- యడ్లపాడు, నాదెండ్ల స్టేషన్‌ల సందర్శన
- కౌంటింగ్ నేపథ్యంలో నమోదైన కేసులపై ఆరా



రొంపిచర్ల పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మలికా గార్గ్

యడ్లపాడు/నాదెండ్ల: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రతిచిన్న ఘటనను కూడా సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుని కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు స్టేషన్లను బుధవారం ఆమె సందర్శించారు. రెండు మండలాల్లో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నెలకొన్న ఘటనల గురించి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. యడ్లపాడు స్టేషన్‌లో విలేకర్లతో ఎస్పీ మలికా గార్గ్ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎంతో సజావుగా, ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. ఫలితాల అనంతరం కొద్దిపాటి అల్లర్లు జరిగాయని చెప్పారు. చిన్న ఘటనను సైతం సీరియస్‌గా పరిగణిస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగానే 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేశామన్నారు. యడ్లపాడు ఎస్సీకాలనీలో జరిగిన ఘర్షణ, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో వైఎస్సార్ విగ్రహం కూల్చివేతపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేసి, బాధ్యులను అరెస్టు చేశామన్నారు. ఘటన చిన్నదైనా, పెద్దదైనా ఒకే దృష్టితో చూస్తామని చెప్పారు. కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తామని తెలిపారు.

మారకుంటే 144 సెక్షన్ కొనసాగింపే...

ఇంకా ఎస్పీ మాట్లాడుతూ... ''కలెక్టర్‌తో సమీక్షిస్తాం. పరిస్థితులు ఇదే విధంగా ఉంటే 144 సెక్షన్‌ను మళ్లీ కొనసాగించక తప్పదు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే సహకరిస్తున్నారు. కాని కిందిస్థాయిలో కొందరు ఇలాంటి అల్లర్లు సృష్టిస్తున్నారు. ప్రజల సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భాగస్వాములు కావాలి.

నగదు సీజ్...పైగా కేసులు ఖాయం..

కోడ్ వచ్చినప్పటి నుంచి జిల్లాలో ప్రీపోల్, పోస్ట్‌పోల్, హోల్డింగ్ కేసులు 160 వరకు నమోదు చేశాం. 1,220 మందిని అరెస్టు చేశాం. దాదాపు 400 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశాం. మరికొందరిపై బైండోవర్ కేసులు కట్టాం. అయినా అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వారికి హామీ ఉంచిన నగదు సీజ్ చేసి, తిరిగి వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధం అవుతున్నాం. సుదీర్ఘ కాలం రౌడీషీట్ల కేసుల్ని పరిశీలిస్తామని, ప్రస్తుతం వారి నడవడికలో మార్పుల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీల్లో విభజించి.. సీ కేటగిరీ వారిపై కేసుల్ని క్లోజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటా''మన్నారు.

రెండు రోజుల్లో వాహనాల రిలీజ్..

ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పట్టుబడిన వందలాది వాహనాలను రెండు రోజుల్లో విడుదల చేస్తామని ఎస్పీ తెలిపారు. ఆధారాలు చూపి వాటిని తీసుకెళ్లేలా ఆదేశించామన్నారు. పొల్యూషన్, ట్యాక్స్ వంటి వాటిని కూడా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా చెక్ చేయించి రిలీజ్ చేస్తామని వెల్లడించారు. లేని వాటిని కోర్టుకు అప్పగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ భూపాల్, రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి సీఐ సుబ్బారెడ్డి, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్, నాదెండ్ల ఎస్ఐ జె బలరామ్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

రొంపిచర్ల: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించిన సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఆమె వెంట డీఎస్పీ సుధాకర్‌రావు, రూరల్ సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ కె.పి.రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తాం

వినుకొండ(నూజెండ్ల): జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతున్న నేపథ్యంలో కౌంటింగ్ అనంతరం ఘర్షణలకు పాల్పడేవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని పల్నాడు జిల్లా ఎస్పీ హెచ్చరించారు. బుధవారం వినుకొండ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. కౌంటింగ్ ముగిసిన రోజున ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కళ్యాణమండపాన్ని కొందరు ధ్వంసం చేసిన ఘటనలో సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామని, వారు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే సహించం

- వాటిని ప్రోత్సహించినా చర్యలు తప్పవు
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- యడ్లపాడు ఎస్సీ కాలనీలో అవగాహన సదస్సుకు ఆదేశం



జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న యడ్లపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు

యడ్లపాడు: టీడీపీ విజయోత్సవాల సందర్భంగా యడ్లపాడు ఎస్సీ కాలనీ(పైపల్లె)లో జరిగిన ఘర్షణకు సంబంధించి సామరస్యంగా పరిష్కారం చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కల్లూరి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పిడతల దయాసాగర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు కలిశారు. ఈనెల నాల్గో తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత యడ్లపాడు ఎస్సీకాలనీలో టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు కాలనీవాసుల్ని అసభ్య పదజాలంతో దూషించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి, ఘర్షణకు దారి తీసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కేవలం ఒకవర్గం వారినే 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి గొడవలు జరగకుండా తాము బాధ్యత వహిస్తామని ఎస్పీకు విన్నవించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇరువర్గాలను పిలిపించి సమస్యకు సామరస్యంగా పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయని ఎస్పీ చెప్పారు. అయితే శాంతియుత వాతావరణం కల్పించేలా ఎస్సీకాలనీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సీఐ పి. శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. రాజకీయ నేతలు, స్థానిక పెద్దలు ఎలాంటి ఘర్షణలను ప్రోత్సహించవద్దన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైనట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం.. 14 మంది టీడీపీ నేతలపై కేసు

తాడికొండ: మోతడక గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన ఘటనలో 14 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనకు కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్, టీడీపీ నాయకులు కొమ్మినేని హరిబాబు, పెనుముచ్చు శ్రీధర్, పెనుముచ్చు వెంకటేశ్వరరావు, బండ్లమూడి హనుమయ్య, గుమ్మడిదల నాగరాజు, కంకణాల గోపీ, రామినేని లక్ష్మీకాంత్, కంచర్ల శివరామకృష్ణ, గింజుపల్లి గణేష్, గుమ్మడిదల తిరుపతిరావు, గుమ్మడిదల మాణిక్యరావు, ఆలపర్తి నరేష్, రామినేని అశోక్, కొంగంటి శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఉద్యోగి ఆత్మహత్య



మేడికొండూరు: అప్పుల బాధ తాళలేక జోసిల్ కంపెనీ ఉద్యోగి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేరేచర్ల కైలాసగిరి కొండవద్ద బుధవారం జరిగింది. చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన దాసరి కళ్యాణ్‌చక్రవర్తి (45) భార్య అనితతో కలిసి ఉపాధి నిమిత్తం పేరేచర్ల వచ్చాడు. పేరేచర్ల ఆంధ్రాషుగర్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ జోసిల్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ నష్టాల పాలయ్యాడు. అప్పుల విషయం తెలుసుకున్న భార్య అనిత కొన్ని రోజుల క్రితం భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కైలాసగిరి వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనకు గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీలో టీడీపీ దాడులు

వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు



దాడిలో గాయపడిన నవీన్



కనుమలచెరువులో దాడులకు పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు

బొల్లాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందిన తర్వాత మండలంలో పలు గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ వారు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని కనుమలచెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ విజయోత్సవం చేసుకుంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలో ర్యాలీ చేస్తూ ఎస్సీ కాలనీకి చేరుకొని ఒక్కసారిగా దాడి చేశారని, ఈ దాడిలో కె.నవీన్, కె.బెన్నితో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని బాధితులు తెలిపారు. వీరిని వినుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత వైఎస్సార్ సీపీ వారు తెలిపారు. బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులును వివరణ కోరగా విజయోత్సవ ర్యాలీ ఘర్షణకు దారి తీసిందని పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

జంగమహేశ్వరపాడులో నాలుగిళ్లు ధ్వంసం

దుర్గి : మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో బుధవారం టీడీపీ శ్రేణులు దాడి చేసి వైఎస్సార్‌సీపీకి నాయకులకు చెందిన నాలుగు ఇళ్లను ధ్వంసం చేశారు. ఈ దాడికి ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దం వచ్చింది. దీంతో మహిళలు, పిల్లలు, ఇరుగుపొరుగు వారు బయటకు పరుగులు తీశారు. ఘటనకు సంబంధించిన బాధిత కుటుంబ మహిళలు, పిల్లలు ఊరి నుంచి వెళ్లి పోయారు. మాచర్ల నుంచి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గతంలో అనేక పర్యాయాలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ఈ గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయినా ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణుల నుంచి తమ ఇళ్లకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీస్ అధికారులకు బాధిత కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు. పటిష్ట కేంద్ర బలగాలతో నిరంతరం ఇళ్ల సోదాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు చేష్టలతో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతోంది. రానున్న రోజుల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా శాంతి యుత వాతావరణం నెలకొల్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీ వర్గీయుల వికృత చేష్టలు

- బాణసంచా మోతకు స్పృహతప్పిన నిండు గర్భిణి
- మోటార్‌సైకిల్ ఢీకొని వీఆర్‌ఏకు గాయాలు



గాయాలపాలైన గేరా భాస్కరరావు

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ వర్గీయులు పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ చేసిన ర్యాలీలో వికృత చేష్టలకు ఓ నిండు గర్భవతి స్పృహతప్పి పడిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కాపురం గ్రామంలో టీడీపీ వర్గీయులు మంగళవారం రాత్రి బాణసంచా కాలుస్తూ హడావుడి సృష్టించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకుల ఇళ్ల ముందు హంగామా చేశారు. బాణసంచా కాలుస్తూ ఇళ్ళపై నిప్పురవ్వలు పడేలా వికృతంగా వ్యవహరించారు. ఈ సమయంలో నిండు గర్భిణి అల్లం మౌనిక పక్కనే బాణసంచా పడి ఒక్కసారిగా పేలటంతో తీవ్ర ఆందోళనకు గురై స్పృహతప్పి పడిపోయింది. అదే సమయంలో అదే కాలనీకి చెందిన వీఆర్‌ఏగా పనిచేస్తున్న గేరా భాస్కరరావు, గేరా బ్రహ్మయ్యలు కాలనీలో నడిచి వెళ్తుండగా టీడీపీ వర్గీయులు బైక్‌లతో వారికి ఢీకొంటూ వెళ్లారు. భాస్కరరావు కింద పడి గాయాలపాలయ్యారు. కాలనీలోని కొందరు యువకులు ప్రతిఘటించటంతో టీడీపీ వర్గీయులు పరారయ్యారు.

తుది ఫలితాల్లో ఓట్ల వ్యత్యాసం!

తెనాలి: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎన్నికల గణాంకాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. పోలైన ఓట్లకు, కౌంటింగ్ అంకెలకు తేడా ఉంది. నియోజకవర్గంలో మొత్తం 273 పోలింగ్ కేంద్రాలు ఉంటే అందులో 77 పోలింగ్ కేంద్రాల్లో 85 శాతంపైగా పోలింగ్ నమోదైంది. వీటిలో 25 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం 90 శాతంపైగానే ఉంది. వీటిలో కొన్ని కేంద్రాల్లో అసాధారణంగా 95 శాతానికి మించి ఓటింగ్ జరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మే నెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఇక్కడ 2,03,825 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లు 3,626గా పేర్కొంటున్నారు. వీటిని కూడా కలిపి ఫలితాలను ప్రకటించారు. పోలైన ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు కలిపితే 2,07,451 అవుతుంది. తుది ఫలితాల జాబితాలో మొత్తం 2,06,355గా చూపారు. అక్కడ తేడా ఉందనుకుంటే, పోటీలో ఉన్న అభ్యర్థులు అందరికీ వచ్చిన ఓట్లను లెక్కిస్తే 2,05,996 ఓట్లు మాత్రమే వస్తున్నాయి. కీలకమైన ఓట్ల లెక్కింపులో ఇన్ని తేడాలు ఎందుకు కనిపిస్తున్నాయనేది ప్రశ్న!

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి



గాయపడ్డ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

గుంటూరు ఈస్ట్: విజయోత్సవాల పేరుతో అల్లర్లు సృష్టించడంతో ఇదేమిటని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడిచేశారు. ఈ ఘటనలో ఇరువర్గాలూ గాయపడినా పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనే కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ముత్యాలరెడ్డినగర్ సమీపంలోని సుగాలీ కాలనీలో టీడీపీ కార్యకర్తలు బుధవారం విజయోత్సవాలు చేసుకున్నారు. డీజే సౌండ్స్ ఎక్కువగా పెట్టడంతో తగ్గించాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దాడిలో ఇరువర్గాల వారు గాయపడ్డారు. అయితే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వెంకటేశ్వర్లు నాయక్, సైదాబాయి నాయక్, హనుమానాయక్, సాయినాయక్, మోహన్‌నాయక్, కిషన్ నాయక్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్తలు రాణావత్ లల్లి, బి.నాయక్, ఉమానాయక్, విజయా నాయక్‌ల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి



శావల్యాపురం :పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కారుమంచిలో బుధవారం జరిగింది. పిడుగుపాటుకు గ్రామానికి చెందిన గోగినేని పాపారావు (40) అక్కడిక్కడే మృతి చెందాడు. పపొలం పనులు చేసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం రావడంతో పిడుగుపాటుకు చనిపోయాడు. పాపారావుకు భార్య, పిల్లలు ఉన్నారు.

144 సెక్షన్‌తో నిర్మానుష్యంగా రోడ్లు



జనసంచారం లేని కారెంపూడి బస్టాండ్ సెంటర్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చాటుమాటుగా వ్యాపారాలు చేస్తున్న కొందరు వ్యక్తులు
- నేడు కూడా వ్యాపారాలు బంద్



గడియారం స్తంభం వద్ద వాహనాలను ఆపి చోదకులను ప్రశ్నిస్తున్న పోలీసులు

నరసరావుపేట: పట్టణంలో పోలీసులు పకడ్బందీగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై అధికారులు స్పందించి 144సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు. కొన్నాళ్లు పకడ్బందీగా నిర్వహించిన పోలీసులు.. కౌంటింగ్‌కు వారం ముందు సడలింపులు ఇచ్చారు. తర్వాత కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తుండటంతో ఈనెల ఒకటో తేదీ నుంచి మళ్లీ అమలులోకి తీసుకొచ్చారు. వ్యాపారాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. సినిమా థియేటర్లలో ప్రదర్శనలు నిలిపివేశారు. ప్రజలు గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. వన్ టౌన్, టుటౌన్ సీఐల ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు సెక్షన్ అమలు చర్యలను చేపట్టారు. మంగళవారంతో కౌంటింగ్ ప్రక్రియ ముగియటంతో బుధవారం ఒక్కసారిగా ప్రజలు తమ కార్లు, ద్విచక్ర వాహనాలతో రోడ్లపైకి వచ్చారు. గత నాలుగు రోజుల నుంచి ఉక్కబట్టుకొని ఉన్న ఆటోవాలాలు రోడ్లపైకి వచ్చి ప్రయాణికులను చేరవేయటం ప్రారంభించారు. దీనిని గమనించిన పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేశారు. రోడ్లపైకి ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించి, వారి వాహనాల పత్రాలను పరిశీలించారు. సక్రమంగా లేని వాటిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారిని వెంటనే ఇళ్లకు వెళ్లాల్సిందిగా హెచ్చరించారు.

చాటుమాటుగా విక్రయాలు

నరసారావుపేట పట్టణంలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు చాటుమాటుగా మద్యం విక్రయాలు చేశారు. ఆర్‌యూబీకి సమీపంలో స్టేషన్‌రోడ్డుపైనున్న బార్ నిర్వాహకులు రహస్యంగా విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి, ప్రకాష్‌నగర్‌లోని స్టేషన్‌రోడ్డు రిక్షాసెంటర్ సమీపంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న జనరల్ షాపులో విక్రయాలు సాగిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవటం విశేషం. కొన్నిరోజులుగా కూరగాయల దుకాణాలను సైతం తెరవనీయకపోవటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. వీరికి కర్రీ పాయింట్లు ఊరట ఇస్తున్నాయి. ఈ దుకాణాల వద్ద ప్రజలు గుమికూడారు.

నేడు కూడా షాపులకు సెలవు

పోలీసుల విజ్ఞప్తి మేరకు గురువారం కూడా పట్టణంలో దుకాణాలు తెరవొద్దని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్ బాబు బుధవారం వెల్లడించారు.

మాచర్లలో..

మాచర్ల: పట్టణంలో మే 13 నుంచి 144 సెక్షన్ కొనసాగుతోంది. ఎక్కడిక్కడ గస్తీ ఏర్పాటు చేశారు. రింగ్‌రోడ్డు సెంటర్, వెల్దుర్తికి వెళ్లే రహదారి, గుంటూరు రోడ్డు, నెహ్రూనగర్, పట్టణంలో పలు ప్రధాన ప్రాంతాల్లో నిరంతరం స్పెషల్ పార్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్సు, పలువురు పోలీసు సిబ్బంది నిరంతరంగా కాపలా ఉంటున్నారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తనిఖీలు చేస్తున్నారు. మాచర్లలో గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులు రాకుండా చర్యలు చేపట్టారు. ఎటు చూసినా పట్టణంలో పోలీసులే కనిపిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. పలు వాహనాలను స్టేషన్‌కు తరలించి, పత్రాలు లేని వాటిని సీజ్ చేస్తున్నారు.

కారెంపూడిలో..

కారెంపూడి: కారెంపూడిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. దీంతో పట్టణంలో బుధవారం కూడా వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. షాపులన్నీ మూతపడ్డాయి. ఒక్క మెడికల్ షాపులు మాత్రమే తెరిచారు. ఆర్టీసీ బస్సులు మాత్రం యథాతథంగా తిరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో పోలీస్ పహారా కొనసాగుతోంది. ఎన్నికల సందర్భంగా మండలంలో చోటు చేసుకున్న విధ్వంసకర ఘటనలు, దాడుల నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ ఇంకా కొనసాగుతోంది. ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు ఇలాగే ఉంటుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

క్యాన్సర్‌పై వైద్యులకు శిక్షణ

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సూచించారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ముందస్తు క్యాన్సర్ నివారణ చర్యలపై పల్నాడు జిల్లా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఎవరికైనా రావచ్చని, ప్రజల్లో అపోహలను తొలగించి చైతన్యం కలిగించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం ఆదేశాల మేరకు శిక్షణను విజయవంతం చేయాలని తెలిపారు. వైజాగ్‌లో శిక్షణ పొందిన వైద్యులు రెండో విడతలో పల్నాడు జిల్లా వైద్యులకు శిక్షణ ఇస్తుండటం వల్ల వారంతా అర్బన్, గ్రామీణ ప్రాంత ప్రజల ఇంటి వద్దకు వెళ్లి క్యాన్సర్ అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలు మెమోగ్రాఫీ, ప్యాప్ స్మియర్, వెల్ స్కోపి చేయాలన్నారు. వాటి ద్వారా క్యాన్సర్‌ను గుర్తించడానికి వీలవుతుందని వెల్లడించారు. శిక్షణ పొందిన వైద్యులు నిబద్ధతతో మూడో విడతలో శిక్షణ పొందే వారికి వైద్య సూచనలు ఇచ్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. నాట్కో క్యాన్సర్ ఆసుపత్రిని రెండో లెవెల్ ఆస్పత్రిగా, రాష్ట్రంలో ఒక ఆపెక్స్ ఆస్పత్రిగా తీర్చిదిద్దడానికి కృష్ణబాబు నేతృత్వంలో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ క్యాన్సర్ ఆస్పత్రిని రిఫరల్ ఆస్పత్రిగా గుర్తించడానికి ప్రయత్నం డాక్టర్ నరసింహం చేస్తున్నారని కిరణ్‌కుమార్ చెప్పారు. గుంటూరు మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న క్యాన్సర్ విభాగంలో సర్జికల్, మెడికల్, రేడిషియల్ ఆంకాలజీ విభాగాలు నెలకొల్పి విజయవంతంగా నిర్వహిస్తున్నారని వివరించారు. న్యూక్లియర్ మెడిసిన్ విభాగాన్ని తీసుకుని వచ్చేందుకూ ఫ్యాకల్టీ పోస్టులు ఇచ్చారని చెప్పారు.

డైట్ కళాశాల ఉద్యోగి మృతి



గుడివాడ టౌన్: గుడ్లవల్లేరు మండలం అంగలూరు డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రేమల్లి సునీల్ కుమార్(43) బుధవారం మృతిచెందారు. గత మూడు రోజులుగా గుండెకు సంబంధించిన ఇబ్బందితో బాధపడుతున్న ఆయన విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సునీల్ కుమార్‌కు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం పెదపారుపూడిలోని ఆయన స్వగ్రామంలో జరుపుతారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, డీవైఈఓ కార్యాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గుంటూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని ఆంధ్ర ప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రాల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు, గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఎంబీటీఎస్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ టి.శేఖర్ పాల్గొన్నారు. డాక్టర్ బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ ఉద్దేశాన్ని వివరించారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన, బయోమెడికల్ వ్యర్థాలను సురక్షితంగా పారవేసేందుకు తమ శాఖలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. టి.శేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సత్యనారాయణ మాట్లాడుతూ శుభకార్యాల సమయంలో అందరూ మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. చిప్స్ కళాశాల విద్యార్థులు 'వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ సిస్టమ్ అండ్ వ్యర్థ జలాల నుంచి శుద్ధి చేసిన నీటి ఉత్పత్తి' నమూనాలను తయారు చేసి ఈవెంట్ హాల్‌లో ప్రదర్శించారు. వక్తలు పలువురు విద్యార్థులను అభినందించారు. మేదరమేట్లకు చెందిన పవన్ ఈవెంట్స్, ఏలూరుకు చెందిన కళాభారతి కల్చరల్ ఈవెంట్స్ తమ పాటల ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గుంటూరు పట్టాభిపురం టీజేపీఎస్ కళాశాల విద్యార్థులు మన శ్రేయస్సు కోసం, వాటిని సురక్షితంగా కాపాడుకోవడం కోసం చెట్ల ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జోసిల్, సీసీఎల్, హిందుస్థాన్ కోకోకోలా, జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్, ఈస్టర్న్ కాండిమెంట్స్‌కు చెందిన ప్రారిశ్రామికవేత్తలు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, టీజేపీఎస్ కళాశాల, చిప్స్ కళాశాలల విద్యార్థులు, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు కరుబసుధ, కె.సుమంత్, అనలిస్ట్ వి.వెంకటేశ్వరరావు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం వల్ల భూమి, జలం, అడవులు సహజత్వాన్ని కోల్పోతున్నాయని గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్‌ఎం కె.సైమాన్ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిపురం గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డీఆర్‌ఎం రామకృష్ణ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో చెట్లు నాటారు. ఆయన మాట్లాడుతూ అత్యంత వేగంగా క్షీణిస్తున్న భూవనరులను సంరక్షించుకోవడానికి ప్రపంచ దేశాలను సమయత్తం చేసేందుకు వీలుగా 2024 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దిన వేడుకలను మన భూమి-మన భవిష్యత్తు అనే నినాదంతో జరుపుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం ర్యాలీని గుంటూరు రైల్వే స్టేషన్‌లో పరిసరాల్లో నిర్వహించారు. ప్రయాణికులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. చెట్లు నాటారు. కార్యక్రమంలో డివిజన్ సంబంధిత అధికారులు డివిజన్ సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీపీఓ షాహబాజ్ హనూర్, సీఎంఎస్ సీహెచ్ శ్రీనివాస్, సీనియర్ డీఈఎన్ అనూషా, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్, సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ, డీఈఎన్ సుదర్శన్ రెడ్డి, డీసీఎం కమలాకర్ బాబు, డీఎస్‌సీ సత్యహరప్రసాద్, డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోనల్ పోటీల్లో సత్తా



సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఫుట్‌బాల్ జిల్లా జూనియర్ జట్టు

- విజయకేతనం ఎగురవేసిన జిల్లా జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టు
- రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

చీరాల రూరల్: బాపట్ల జిల్లా జూనియర్స్ ఫుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం జోనల్ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా పేరెచర్ల వెళ్లిన జిల్లా జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అన్ని విభాగాల్లో రాణించి పల్నాడు జిల్లా, గుంటూరు జిల్లా, ప్రకాశం జిల్లాల జట్లను ఓడించి, విజేతగా నిలిచారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గురువారం విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా నుంచి జూనియర్ జట్టు క్రీడాకారులు పాల్గొంటారని బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

పీఆర్కే నివాస ప్రాంతంలో ప్రత్యేక పోలీసుల గస్తీ

మాచర్ల: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లే రహదారిలో ఇనుప కంచె వేసి స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు పట్టణంలో రామాటాకీస్‌కు వెళ్లే దారిలో పోలీసులు ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఎవరూ తిరగకుండా చర్యలు చేపట్టారు. కొత్త వ్యక్తులు వస్తే వివరాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా మాచర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కీలక నేతలకు అండగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

గోతిలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి

వేమవరం(వత్సవాయి): బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి గోతిలో పడిపోవడంతో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. పెనుగంచిప్రోలుకు చెందిన మందా కార్తీక్(22) వేమవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి సమయంలో వేమవరం వచ్చి తిరిగి పెనుగంచిప్రోలు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయాడు. దీంతో అదుపుతప్పి గోతిలో పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ బి. అభిమన్యు కేసు నమోదు చేశారు.

11న గుంటూరులో సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం



సీహెచ్ సాంబయ్య (ఫైల్)



ప్రొఫెసర్ దేపురు భారతి

తెనాలి: రూరల్ మండలం ఖాజీపేటకు చెందిన సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న అవార్డు ప్రదానోత్సవం ఈనెల 11వ తేదీన గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కంచి కామకోటి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికలో జరుగనుంది. సాయంత్రం 6.30 గంటలకు జరగబోయే సభలో 'విద్యాప్రదాత' సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డును తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేపురు భారతికి ప్రదానం చేయనున్నారు. పరిషత్ అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు బుధవారం ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. 2009లో స్థాపించిన తమ పరిషత్ ఏటా విద్య, వైద్య, వైజ్ఞానిక, కళాసేవ అంశాల్లో ఒక ప్రముఖుడికి అవార్డు ప్రదానం చేసి సత్కరిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న ప్రొఫెసర్ దేపురు భారతిని ఎంపిక చేశామన్నారు. అవార్డు ప్రదానోత్సవంలో ఏటా పదో తరగతి పరీక్షల్లో జిల్లా/రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు సాధించిన విద్యార్థికి ప్రతిభాపురస్కారం, రూ.10 వేల నగదును అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో అత్యధికంగా 599/600 మార్కులు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయి మనస్వినికి 10 వేల ప్రోత్సాహక నగదుతో ప్రతిభాపురస్కారం అందిస్తామని తెలిపారు. ఇదే వేదికపై విజయవాడకు చెందిన నాట్యమయూరి లేఖ్యా భరణి బృందంచే నృత్యప్రదర్శన మరో అంశమని వివరించారు. తమ సంస్థచే పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, గతేడాది జిల్లా విద్యాశాఖాధికారి వినతి ప్రకారం కొండవీటి కమిటీ హైస్కూల్ విద్యార్థులకు వేసవి రోజుల్లో మధ్యాహ్న భోజనంలో నెలరోజులపాటు మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

అద్దంకిలోనే ఉంటా..

- నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తా..
- ప్రజల పక్షాన పోరాడుతాం..
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి: అద్దంకి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన తనకు మద్దతు ప్రకటించిన నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు ప్రజలకు, అభిమానులకు అభినందలు తెలియజేస్తున్నానని పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. పోటీ చేయడానికి అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆయన ఆదేశానుసారం నడుచుకుంటానన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఓటమి అనంతరం కార్యకర్తలు నాయకులతో కలిసి మాట్లాడారు. జయాపజయాలు గురించి పట్టించుకునే పనిలేదన్నారు. తాను గెలిచినా, ఓడినా ఇక్కడే ఉంటానని చెప్పిన ప్రకారం ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని కార్యకర్తలకు, నాయకులకు, సామాన్యులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించి సమాధానం చెబుతానని చెప్పారు.

పుకార్లు నమ్మవద్దు..

తాను ఓడిపోయాను కాబట్టి, ఇతర ప్రాంతం నుంచి వచ్చాను కాబట్టి.. ఇక్కడ ఉండనని.. వెళ్లిపోతానని గిట్టని వాళ్లు పుకార్లు పుట్టిస్తున్నారన్నారు. వాటిని ఎవరూ నమ్మవద్దని చెప్పారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని, మరోసారి గెలిచేందుకు, పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. ఎక్కడా ప్రతిదాడులకు దిగవద్దన్నారు.

సూపర్‌సిక్స్ అమలుకు కట్టుబడాలి..

చంద్రబాబు మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రతిపక్షంగా అధికారపార్టీ వైఫల్యాలను ఎండగడుతూ, నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ, ప్రజలకు అండగా ఉంటానని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభిమానులున్నారు.

నెలాఖరు నాటికి సొంత భవనాల్లోకి కేంద్రీయ విద్యాలయం

- రూ.19.8 కోట్లతో అధునాతన వసతులు
- ఈ ఏడాది పదో తరగతి వరకు క్లాసులు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ ప్రారంభం



ఇర్లపాడులో ప్రారంభానికి సిద్ధమవుతున్న కేంద్రియ విద్యాలయం భవనాలు

నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రియ విద్యాలయం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరు నాటికి సంబంధిత భవనాన్ని అధికారులకు కాంట్రాక్టర్ అప్పగించనున్నారు. జులై నుండి క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకూ గణపవరం సీఆర్ కళాశాల ఆవరణలోని భవనాల్లో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. 2018లో పాఠశాలకు అనుమతులు రాగా, 2019 నుండి తరగతులు ప్రారంభమయ్యాయి. ఒకటో తరగతి నుండి ఇంటర్ వరకు అనుమతులు వచ్చాయి. ఈ ఏడాది కొత్త భవనాల్లో పదో తరగతి వరకు క్లాసులు జరగనున్నాయి. సుమారు 9.61 ఎకరాల్లో రూ.19.8 కోట్ల వ్యయంతో అధునాతన తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయులకు అవసరమైన స్టాఫ్ రూమ్‌లు, సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణాలు పూర్తయ్యాయి. విద్యార్థులు ఆటలాడేందుకు క్రీడా ప్రాంగణం అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల చిలకలూరిపేట-నరసరావుపేట రహదారి నుంచి విద్యాలయం వరకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అనుమతులు మంజూరు చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ షేక్ అహ్మద్ ఫరూక్ తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా, పాఠశాల ఆవరణలోనూ వివిధ మొక్కలు నాటి పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పల్నాడు జిల్లా పరిధిలోని 10 కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఇద్దరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లకు తగు సూచనలు చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఫ్యాన్లు, ఇతర మౌలిక వసతులను కల్పించినట్టు వివరించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన 10వ తరగతి పరీక్షకు 243 మందికి గాను 206 మంది, ఇంటర్మీడియట్‌లో 297 మందికి గాను 258 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష

- వరినారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- అప్పుడే నాణ్యమైన దిగుబడులకు ఆస్కారం
- గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి సూచనలు





వరి నారుమడుల తయారీ

గుడ్లవల్లేరు: వరినారు పోసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారును పొందవచ్చు. నారుమడి యాజమాన్య పద్ధతులను గుడివాడ వ్యవసాయ అధికారి బోలెం అనంతలక్ష్మి ఇలా సూచిస్తున్నారు.

నారుమడి తయారీ ఇలా..

దమ్ము చేసిన నేలను 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగాను పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడి 10నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే ఈ జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగులు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటపుడు కొసలు విరిచి నాటాలి. దీనితో గుడ్లను నిర్మూలించవచ్చు.

విత్తన మోతాదు ఇలా...

నాటే పద్ధతికి 20నుంచి 25కిలోలు వెదజల్లడానికి విత్తనాలను వినియోగించవచ్చు. గరువు భూముల్లో 24నుంచి 30కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16నుంచి 30కిలోలు సరిపోతాయి. గొర్రుతో విత్తటానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30నుంచి 36కిలోల అవసరం ఉంటుంది. శ్రీ పద్ధతిలో రెండు కిలోలే సరిపోతాయి.

విత్తన శుద్ధి ఇలా..

కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్‌ను కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24గంటల నానబెట్టాలి. మరో 24గంటల పాటు మండె కట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన తాలు విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24గంటల పాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరీఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

సస్యరక్షణ ఇలా..

విత్తిన 10రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.0మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి విత్తన 10రోజుల నుంచి 17రోజులకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయటానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

ఎరువుల యాజమాన్యం ఇలా..

నారుమడులు పోయాలనుకున్న భూములకు వేసవి దుక్కికి ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్త పడాలి. 5సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు మరో కిలో విత్తిన 12నుంచి 14రోజులకు ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చు.